# మహిళలు అత్యంత ప్రమాదకర స్థితిలో వున్న దేశాల్లో అగ్రస్థానం మనదే

**మహిళల** సమస్యలపై దాదాపు 500 మంది నిపుణులతో థామస్ రాయిటర్స్ ఫౌండేషన్ ఓ సర్వే నిర్వహించింది. ఐక్యరాజ్య సమితి 193 సభ్యదేశాల్లో ఏ దేశాలు మహిళలకు అత్యంత ప్రమాదకరంగా వున్నాయో, మహిళల ఆరోగ్యరక్షణ, ఆర్థిక వనరులు, సాంస్కృతిక సాంప్రదాయ దురాచారాల ఆచరణ, లైంగిక హింస, వేధింపులు, లైంగికేతర హింస, మహిళలను వేశ్యావృత్తిలోకి దించడం వంటి అంశాలలో ఏదేశాలు ఘోరంగా వున్నాయో-ఈ సర్వేలో ప్రధానాంశాలుగా చర్చించి, నివేదిక విడుదల చేశారు.

ఆన్‌లైన్‌లో, ఫోన్‌ద్వారా, వ్యక్తిగతంగా కలవటం ద్వారా మార్చి 26, మే 4వ తేదీల మధ్య యూరోప్, ఆఫ్రికా, అమెరికా, దక్షిణ తూర్పు ఆసియా, దక్షిణాసియా, పసిఫిక్ ప్రాంతాలలో నివసించే 548 మంది నుండి ఈ వివరాలను సేకరించారు. వివరాలు తెలిపిన వారిలో వృత్తినిపుణులు, విద్యావేత్తలు, ఆరోగ్యరక్షణ సిబ్బంది, ప్రభుత్వేతర సంస్థల కార్యకర్తలు, విధాన రూపకర్తలు, అభివృద్ధి నిపుణులు మరియు సామాజిక వ్యాఖ్యాతలు వున్నారు.

సర్వే నిర్వాహకుల ప్రశ్నలకు సమాధానా లిచ్చిన వీరంతా లైంగికహింస, హహిళల రవాణా, వేశ్యావృత్తిలోకి దించటం, లైంగిక బానిసత్వంతో సహా, ఇంటిచాకిరీ, మరియు బాల్యవివాహాలు, ఆడపిల్లల హత్యలు వంటి దురాచారాలు అత్యధికంగా కొనసాగుతున్న, మహిళల పాలిట 'అత్యంత ప్రమాదకర దేశం'గా మనదేశానికి మొదటిస్థానమిచ్చారు.

ఇదే అంశంలో పైశ్రేణిలోనున్న ఇతర దేశాలలో ఆఫ్ఘనిస్తాన్, అమెరికా, సిరియా, సోమాలియా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, కాంగో, యెమెన్, నైజీరియా మరియు ఈజిప్టు మనదేశం తర్వాత 9 స్థానాలలో వున్నాయి.

2011లో ఇదేతరహా సర్వే నిర్వహించినపుడు ఆఫ్ఘనిస్థాన్, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, పాకిస్థాన్, ఇండియా మరియు సోమాలియా దేశాలు మహిళల పాలిట అత్యంత ప్రమాదకరమైన దేశాలుగా వెల్లడైంది.

నిర్వాహకులు అడిగిన ఏడు ప్రశ్నలకుగాను నాలుగు ప్రశ్నలకు - మహిళల ఆరోగ్యరక్షణ, దాడుల సంబంధిత హింసల విషయంలో ప్రశ్నలకు ఆఫ్ఘనిస్థాన్ ఘోరమైన దుస్థితిలో వుందని తేలింది. ఆఫ్ఘన్‌లోని మహిళలు, ఆడపిల్లలు తీవ్రమైన లింగ ఆధారిత హింసను, దూషణలను, నిరక్షరాస్యతను, పేదరికాన్ని, ఇతర మానవహక్కుల హననాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నారు.

7 సం॥లుగా సాగుతున్న యుద్ధం యొక్క ప్రభావంతో మహిళల ఆరోగ్యరక్షణ, మహిళలపై లైంగిక, లైంగికేతర హింసల కారణంగా సిరియా ఈ సర్వేలో మూడవస్థానంలో నిలిచింది.

సోమాలియాలో 2 దశాబ్దాలపైగా యుద్ధం హింసా సంస్కృతిని రగిలిస్తూ చట్టాలను అమలు చేయాల్సిన సంస్థలను పూర్తిగా బలహీనం చేసింది. ఈ కారణంగా మహిళలకు అత్యంత ప్రమాదకరమైన ఐదు దేశాలలో సోమాలియా ఒకటిగా వుంది.

ఇండియా, లిబియా, మయన్మార్ దేశాలలో మహిళల అక్రమ రవాణా, పెద్ద ఎత్తున వ్యభిచారం లోకి దించటం వంటి వాటిలో అంతర్జాతీయ స్థాయిలో ఒక అంచనా ప్రకారం సంవత్సరానికి 15,000 కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతూ ప్రపంచంలోనే ఈ దేశాలు మహిళల పాలిట అత్యంత ప్రమాదకర దేశాలుగా పరిగణించబడుతున్నాయి.

ఈ అంశంలో సౌదీ అరేబియా ఐదవ స్థానంలో వుంది. ఇక్కడ సమానావకాశాలు లేకుండా మహిళలను నిరోధిస్తున్న ఘోరమైన చట్టాలలో సంరక్షణ చట్టం ఒకటిగా వుంది. ఇక్కడ ప్రతి మహిళ ఒక పురుష సంరక్షకుని పర్యవేక్షణలో వుండితీరాలి. లేకుంటే ఆమెకు పాస్‌పోర్టు రాదు, ప్రయాణం వీలుకాదు, కొన్ని సందర్భాలలో ఉద్యోగం, ఉపాధి కూడా లభించదు.

2011 సం॥ సర్వేలో మహిళలకు ప్రమాదకర దేశాల జాబితాలో మూడో దేశంగా వున్న పాకిస్తాన్, ప్రస్తుత సర్వేలో ర్యాంకును మెరుగు పరుచుకుని ఆరవస్థానంలో నిలిచింది. మహిళల ఆర్థికవనరులు, పనిప్రదేశాలలో మహిళల పట్ల వివక్ష, భూమి సంబంధ అంశాలు, పరువు హత్యలుగా పిలవబడే సాంస్కృతిక, మతపర, సాంప్రదాయ దురాచారాల అమలు విషయంలో పాకిస్తాన్ నాల్గవ అతి ప్రమాదకర దేశంగా పేరుగాంచింది. లైంగికేతర హింస విషయంలో ఐదవ స్థానంలో నిలిచింది.

2011 సర్వేలో 2వ స్థానంలో నిలిచిన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో తన స్థానాన్ని సవరించుకొని మహిళలకు అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన దేశాల జాబితాలో 7వ స్థానంలో నిలిచింది. సామ్రాజ్యవాదుల జోక్యం, దుర్మార్గం కారణంగా సంవత్సరాల తరబడి సాగిన పాలక ముఠాల వైరుధ్యాలు సృష్టించిన రక్తపాతం అనంతరం కాంగోలో లక్షలాది

ప్రజానీకం నరకప్రాయమైన దుర్భర జీవనస్థితిలో వున్నారు. సామూహిక అత్యాచారాలతో సహా ఘోరమైన హింసా పద్ధతుల నడుమ దాదాపు 43 లక్షలమంది ప్రజలు విస్థాపనకు గురయ్యారు.

మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశాల జాబితాలో యెమెన్ 8వ స్థానంలో వుంది. ఆరోగ్య రక్షణ, ఆర్థిక వనరులు, సాంస్కృతిక, సాంప్రదాయక దురాచారాలు, లైంగికేతర హింస వంటి అంశాల్లో యెమన్ పరిస్థితి ఘోరంగా వుంది. సౌదీ అరేబియా, యెమెన్‌లో యుద్ధ తరహా దాడి సాగిస్తూ పదివేల మందిని హతంచేసి, 30 లక్షల మందిని నిర్వాసితులను చేయడమే గాక, దేశంలో ప్రజలు ఆకలిబాధతో అల్లాడిపోయేటట్లు చేసింది. యెమన్‌లో ఇప్పటికీ 2 కోట్ల 20 లక్షలమంది ప్రజానీకం కీలకమైన సహాయాన్ని కోరే స్థితిలో వుండి, ప్రపంచంలోనే అత్యంత ఘోరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

నైజీరియాలో బోకోహరమ్ ఇస్లామ్ మతతత్వ చొరబాటుకు వ్యతిరేకంగా సాగిన 9 సం॥ల యుద్ధంలో దేశంలో సైనికులు మహిళలపై అత్యాచారాలు సాగించారని, పౌరులను హీనమైన చిత్రహింసలకు గురిచేశారని మానవహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రపంచంలో మహిళల పాలిట ప్రమాదకర దేశాల జాబితాలో నైజీరియా 9వ స్థానంలో వుంది. దేశంలో సాగుతోన్న ఈ ఘర్షణలలో 30వేల మంది ప్రజలు హతులయ్యారు. ప్రపంచంలోని అతి ఘోరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దేశాలలో నైజీరియా ఒకటిగా వుంది.

ఆఫ్రికాలో అత్యధిక జనాభా కలిగిన నైజీరియా, సాంస్కృతిక, సాంప్రదాయ దురాచారాలకు మహిళలు బలవుతున్న అంశంలో ప్రపంచ దేశాలలో ఆరవ స్థానాన్ని, మహిళలపై లైంగిక హింస అధికంగా సాగుతున్న దేశాల జాబితాలో 10వ స్థానాన్ని ఆక్రమించింది. మహిళలను వ్యభిచారం కోసం తరలించే దానిలో నాల్గవ ప్రమాదకర దేశంగా నైజీరియా వుంది. లక్షలాదిమంది నైజీరియా మహిళలు ఐరోపా దేశాలకు తరలించబడుతూ లైంగిక దోపిడీకి గురిచేయబడుతున్నారు.

మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశాల జాబితాలోవున్న ఒకేఒక్క పాశ్చాత్యదేశం అమెరికా. అమెరికా ఈ జాబితాలో పదవస్థానంలో వుంది. అత్యాచారాలతో సహా లైంగిక హింస, లైంగిక వేధింపులు, అత్యాచార కేసులలో న్యాయం లభించకపోవటం వంటి అంశాలలో అమెరికా పరిస్థితి ఘోరంగా వుంది. లైంగికేతర హింస అంశంలో అమెరికా ఆరవస్థానంలోవుంది.

అమెరికా మినహా, పై శ్రేణిలోని 9 దేశాలలో ఇండియా, సౌదీ అరేబియా తప్పించి మిగిలిన దేశాలన్నీ అమెరికా యొక్క ప్రత్యక్ష దురాక్రమణ, సైనిక జోక్యానికి బాధిత దేశాలే. దురక్రమణ సేనలు అత్యాచారాన్ని యుద్ధ ఆయుధంగా ఉపయోగిస్తాయి. అదేవిధంగా దీర్ఘకాలయుద్ధం ప్రజల జీవన ప్రమాణా లను ప్రత్యేకించి మహిళల జీవన ప్రమాణాలను దిగజార్చి, వారిని వ్యభిచరించే వైపు నెడుతోంది. పైగా అమెరికా నిఘా ఏజెన్సీల సహాయంతో పుట్టుకొచ్చే మతతత్వ టెర్రరిస్టు సంస్థలు, అదేవిధంగా టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు పోజుపెట్టే శక్తులు తరచుగా మహిళలపై హింసకు పాల్పడుతున్నాయి.

ooooo